

రైతువేదికను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి

## మెనూ ప్రకారం భోజనం వడ్డిస్తున్నారా..?

- విద్యార్థులను ప్రశ్నించిన ఎమ్మెల్యే విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి
- సింగవరం-2లో పాఠశాల అదనపుగది, రైతువేదిక ప్రారంభం

అలంపూర్, జనవరి 10 : మండలంలోని సింగవరం-2లో రూ.10లక్షల జెడ్పీ నిధులతో నిర్మించిన ప్రభుత్వ పాఠశాల అదనపు గదులను బుధవారం ఎమ్మెల్యే విజయుడు, ఎమెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి సర్పంచ్ అనితాసాయిబాబాతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు విద్యార్థులతో ముచ్చటించారు. విద్యాభ్యాసం ఎలా ఉంది..? వసతులు ఎలా ఉన్నాయి..? భోజనం మెనూ ప్రకారం వడ్డిస్తున్నారా? తదితర విషయాలను తెలుసుకున్నారు. ఎంఈవో అశోక్‌కుమార్, సర్పంచ్, ఉపాధ్యాయులు, గ్రామస్తుల కోరికమేరకు పాఠశాలకు ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తామని ఎమ్మెల్సీ హామీ ఇచ్చారు. అనంతరం రైతులు ఎమ్మెల్యే విజయుడితో సమస్యలను విన్నవించారు. అలాగే మండలంలోని బుక్కాపురం క్లస్టర్‌లో రూ.22లక్షలతో నిర్మించిన రైతు వేదికను సర్పంచులు, ఎంపీటీసీతో కలిసి ప్రారంభించారు. వ్యవసాయ అధికారులు కార్యక్రమానికి హాజరుకాలేదు. అంతకుముందు ఎమ్మెల్యే, ఎమ్మెల్సీకి గ్రామస్తులు, బీఆర్ఎస్ నాయకులు ఘనస్వాగతం పలికారు. కార్యక్రమంలో సర్పంచులు, ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

***కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య వాగ్వాదం, తోపులాట***

రైతువేదిక ప్రారంభోత్సవంలో ప్రొటోకాల్ పాటించలేదని, వ్యవసాయధికారులను ఎందుకు పిలవలేదనే విషయంలో గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకులు బీఆర్ఎస్ నాయకుల మధ్య వాగ్వాదంతో కూడిన తోపులాట చోటుచేసుకున్నది. కలెక్టర్ ఆదేశాల మేరకే ప్రారంభోత్సవ కార్యక్రమం చేపట్టామని, వ్యవసాయాధికారులకు కూడా సమాచారం ఇచ్చామని బీఆర్ఎస్ నాయకులు విలేకరులకు వివరించారు. సంబంధిత అధికారులకు లేనిబాధ కాంగ్రెస్ నాయకులకు ఎందుకని ప్రశ్నించారు. కార్యక్రమానికి అడ్డుతగిలినవారు ప్రజాప్రతినిధులు కారు, అధికారులు అంతకన్నాకాదు ఎందుకు కార్యక్రమాన్ని డిస్టర్బ్ చేస్తున్నారని నిలదీశారు. దీంతో రైతువేదిక ప్రారంభోత్సవం అనంతరం సభ నిర్వహించకుండానే బీఆర్ఎస్ నాయకులు వెళ్లిపోయారు. ఈ ఘటనపై ఇరువర్గాల వారు అలంపూర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసుకున్నారు.

***పాడె మోసిన ఎమ్మెల్యే విజయుడు***

అయిజ, జనవరి 10 : పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన గజ్జి ఉత్తనూరమ్మ (77) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే విజయుడు ఆమె భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చి ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం ఆమె పాడె మోశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాడె మోస్తున్న ఎమ్మెల్యే విజయుడు



బలిగేరలో పల్లెప్రకృతి వనాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

## బీఆర్ఎస్ హయాంలోనే పల్లెల్లో ప్రగతి

- గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

గట్టు, జనవరి 10 : కేసీఆర్ సర్కారు హయాంలోనే పల్లెలు అభివృద్ధి సాధించాయని ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని అంతంపల్లిలో గ్రామ పంచాయతీ భవనం, బలిగేరలో గ్రామ పంచాయతీ భవనం, పాఠశాల అదనపు గది, పల్లె ప్రకృతివనాన్ని బుధవారం ప్రా రంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గతంలో పాలించిన కాంగ్రెస్ ప్రభుత్వం పల్లెలను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడి సీఎం కేసీఆర్ అధికారం చేపట్టాకే పల్లెలు ప్రగతి వైపు దూసుకుపోయాయన్నారు. పల్లె ప్రకృతివనాలు, పంచాయతీలకు ట్రాక్టర్లు, సీసీ రోడ్లు, డ్రైనేజీలు, కమ్యూనిటీహాళ్లు, రైతువేదికలు కేసీఆర్ సర్కారు చేపట్టిన అభివృద్ధికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ అధికారం చేపట్టినా కూడా బీఆర్ఎస్ అభివృద్ధిని ఎవరూ కాదనలేదన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ విజయ్‌కుమార్, జెడ్పీటీసీ శ్యామల, వైస్ ఎంపీపీ సుమతి, సర్పంచులు హనుమంతు, ఆంజనేయులుగౌడ్, ఎంపీటీసీ రూపవతి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీధర్‌గౌడ్, రామన్‌గౌడ్, రామకృష్ణారెడ్డి, ఆనంద్‌గౌడ్, బస్వరాజు, బజారి, తిమ్మప్ప, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

***వైద్య, ఆరోగ్య శాఖ మంత్రిని కలిసిన ఎమ్మెల్యే***

గద్వాల, జనవరి 10 : వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి దామోదర రాజనర్సింహను ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కలిశారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ భవన్‌లో మర్యాద పూర్వకంగా కలుసుకున్నారు. జోగుళాంబ గద్వాల జిల్లా కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న 300 పడకల దవాఖానలో అవసరమైన మౌళిక వసతుల కల్పనకు అదనంగా రూ.25 కోట్లు ఇవ్వాలని విన్నవించారు. అలాగే నియోజకవర్గంలోని పీహెచ్‌సీల్లో ఖాళీగా ఉన్న మెడికల్ అధికారుల నియామకం చేపట్టాలన్నారు. నడిగడ్డ ఇప్పుడిప్పుడే విద్య, వైద్య పరంగా అభివృద్ధి చెందుతుందని చెప్పారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

## ఆశాజనకంగా ధరలు

- కందులు @ రూ.10,009

నారాయణపేట, జనవరి 10 : పట్టణంలోని వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం 29 క్వింటాళ్ల తెల్ల కందులు విక్రయానికి రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.10,009, కనిష్ఠంగా రూ.8,809 ధర పలికాయి. అదేవిధంగా 432 క్వింటాళ్ల ఎర్ర కందులు విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.9,851, కనిష్ఠంగా రూ.9,225 ధర పలికాయి. 31క్వింటాళ్ల సోనరకం ధాన్యం విక్రయానికి రాగా, క్వింటాకు గరిష్ఠంగా రూ.3,009, కనిష్ఠంగా రూ.2,969 ధర పలికాయి. 10 క్వింటాళ్ల వేరుశనగ విక్రయానికి రాగా, క్వింటాకు రూ.5,580 ధర పలికినట్లు మార్కెట్‌యార్డు సూపర్‌వైజర్ లక్ష్మణ్ తెలిపారు.

***జడ్చర్లలో రూ.9,160***

జడ్చర్ల, జనవరి 10 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌లో పంట ఉత్పత్తులకు ధరలు ఆశాజనకంగా లభిస్తున్నాయి. కందులకు ధరలు పెరిగాయి. ఈ సారి వర్షాభావంతో పంటలు దెబ్బతిన్నాయి. కంది విత్తనాలు వేసే సమయంలో వానలు పడి.. తర్వాత ఆశించిన స్థాయిలో కురవకపోవడంతో పైర్లు ఎదగలేదు. దీంతో కంది పూత, కాత రాకపోవడంతో దిగుబడులు తగ్గాయి. బోర్లు, కాల్వల కింద పంట సాగు చేసిన రైతులకు మాత్రం దిగుబడి బాగా వచ్చింది. అయితే దిగుబడి తగ్గడంతో మార్కెట్‌లో కందికి డిమాండ్ పెరగడంతో మంచి ధరలు పలుకుతున్నాయి. ఇంకా ధర పెరిగే అవకాశం ఉన్నదని వ్యాపారులు, మార్కెట్ వర్గాలు అంటున్నాయి. బాదేపల్లి మార్కెట్‌కు బుధవారం కందులు విక్రయానికి వచ్చాయి. మార్కెట్‌కు 78 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా క్వింటాకు రూ.9,160 ధర, కనిష్ఠంగా రూ.8,821, మధ్యస్తంగా రూ.9,111 ధర పలికింది. వీటితోపాటు ధాన్యం, మొక్కజొన్న, వేరుశనగ, ఉలువలు, పత్తి కూడా అమ్మకానికి వచ్చింది. ఆర్ఎన్ఆర్ ధాన్యం 77 క్వింటాళ్లు రాగా క్వింటాకు గరిష్ఠంగా రూ.2,711 ధర, కనిష్ఠంగా రూ.2,569, మధ్యస్తంగా రూ.2,711 పలికింది. మొక్కజొన్న 42 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.2,287ధర, కనిష్ఠంగా రూ.2,287, మధ్యస్తంగా రూ.2,287 ధర వచ్చింది. హంస ధాన్యం 49 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.1,958 ధర లభ్యమైంది. వేరుశనగ 849 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.8,109ధర, జొన్నలు 2 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.1,851 ధర, ఉలువలు 9 క్వింటాళ్లు రాగా గరిష్ఠంగా రూ.5,952 ధర, పత్తి 450 క్వింటాళ్ల పత్తి అమ్మకానికి రాగా గరిష్ఠంగా రూ.6,389 ధర వచ్చింది.

## పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదాం

- భవిష్యత్‌తరాలకు భరోసా కల్పించాలి : పీయూ రిజిస్ట్రార్ గిరిజామంగతాయారు

పాలమూరు, జనవరి 10 : ప్రకృతిని పరిరక్షించి భవిష్యత్ తరాలకు భరోసా కల్పించాల్సిన బాధ్యత మనపైనే ఉన్నదని పీయూ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు అన్నారు. స్థానిక ఎంవీఎస్ డిగ్రీ కళాశాలలో బుధవారం హరిత రసాయన శాస్త్రం-పర్యావరణ పరిరక్షణ అనే అంశంపై ప్రిన్సిపాల్ పద్మావతి అధ్యక్షతన జాతీయ సదస్సు నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా పాలమూరు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ గిరిజా మంగతాయారు హాజరై హరిత రసాయనశాస్త్ర ప్రాముఖ్యత గురించి వివరించారు. జేఎన్‌టీయూ ప్రొఫెసర్ అశోక్ మాట్లాడుతూ ప్రస్తుతం విశ్వవిద్యాలయాలు, కళాశాలల్లో ప్రయోగ విధానాలు ఇంకా పాత పద్ధతులలో కొనసాగుతున్నాయన్నారు. బోధన, అభ్యాసన కార్యక్రమాల్లో మార్పు తేవాలని తెలిపారు. అలాగే ప్రొఫెసర్ రాజేందర్‌రెడ్డి ఐరన్ ఉత్ప్రేరకాలు, సాధారణ అణు ఉత్ప్రేరకాలు, అనువర్తనాలు, హరిత రసాయనశాస్త్ర పాత్రను వివరించారు. అనంతరం జాతీయ సదస్సుకు సంబంధించిన సావనీర్‌ను విడుదల చేశారు. కార్యక్రమంలో రసాయనశాస్త్ర విభాగాధిపతి స్యనారాయణగౌడ్, రాఘవేందర్, తిరుపతయ్య తదితరులు పాల్గొన్నారు.



మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సోదరుడు ఆల శశివర్ధన్‌రెడ్డి మృతిచెందగా.. మాజీ మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి బుధవారం అన్నాసాగర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. శశివర్ధన్‌రెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులైన తల్లి వరలక్ష్మి, భార్య శ్రీలతను ఓదార్చారు.

*- భూత్పూర్, జనవరి 10*



అనంతవరం గ్రామ ముఖచిత్రం

# పంచాయతీ పోరు పెండింగేనా?

- జీపీ ఎన్నికలపై సర్కారు నో క్లారిటీ
- సార్వత్రిక ఎలక్షన్ల తర్వాత నిర్వహించే అవకాశం
- ఇంకా మొదలుకాని ప్రక్రియ
- ప్రత్యేకాధికారులతో ముందుకెళ్లేలా యోచన!
- ఈ నెలతో ముగియనున్న పాలకవర్గాల కాలపరిమితి
- ఆరు గ్యారెంటీలు, గ్రామాల అభివృద్ధిపై ప్రభావం
- స్థానికంగా బలీయంగా బీఆర్ఎస్

నాగర్‌కర్నూల్, జనవరి 10 (నమస్తే తెలంగాణ) : పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. ఈ నెలాఖరుతో ప్రస్తుత పాలకవర్గాల కాలపరిమితి ముగియనుండగా.. ఫిబ్రవరిలో కొత్తగా ఎన్నికైన వారు పగ్గాలు చేపట్టాల్సి ఉన్నది. అయితే, కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల నిర్వహణకు వెనుకడుగు వేస్తున్నట్లు ప్రచారం జరుగుతున్నది. స్థానికంగా బీఆర్ఎస్ బలీయంగా ఉండడంతోపాటు ఆరు గ్యారెంటీల అమలులో జాప్యం చేసేందుకు కాంగ్రెస్ ఎంపీ ఎన్నికలను సాకుగా చూపుతూ పంచాయతీ ఎన్నికలకు మొగ్గు చూపడం లేదని తెలుస్తున్నది. దీంతో భవిష్యత్తులో పంచాయతీల అభివృద్ధిపై ప్రభావం చూపనున్నది.




బొందలపల్లి గ్రామ పంచాయతీ కార్యాలయం

రాష్ట్రం, దేశం బాగుపడాలంటే గ్రామాల అభివృద్ధితోనే సాధ్యం. దీన్ని సుసాధ్యం చేస్తూ కేసీఆర్ సర్కారు పంచాయతీలకు భారీగా నిధులు విడుదల చేసింది. అలాగే బలీయమైన పాలన చేపట్టేలా చర్యలు తీసుకున్నది. దీంతో గత పదేండ్లల్లో అంచనాలకు మించి డెవలప్‌మెంట్ జరిగింది. కాగా, 2019 జనవరిలో పంచాయతీ ఎన్నికలు జరగగా.. ప్రస్తుత పాలకవర్గాల పదవీ కాలం ఈ నెలాఖరుతో ముగియనున్నది. ఈ క్రమంలో వచ్చే నెలలో కొత్త పాలకవర్గాలు పగ్గాలు చేపట్టాల్సి ఉన్నది. ఈ ప్రక్రియ పూర్తి కావాలంటే కనీసం రెండు వారాలకుపైగా సమయం పడుతుంది. కానీ, ఇప్పటివరకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎలాంటి చర్యలు చేపట్టకపోవడం విస్మయపరుస్తున్నది. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి రాగా, వాటి అమలుపై ప్రజలు గంపెడాశలు పెట్టుకొన్నారు. ప్రజల నుంచి దరఖాస్తులు తీసుకోగా.. ఆన్‌లైన్ ప్రక్రియ కొనసాగుతున్నది. క్షేత్ర స్థాయిలో పరిశీలన తర్వాత గ్రామ సభల్లో లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. దీని ప్రకారం గ్రామ పంచాయతీలకు కొత్త పాలకవర్గాలు తప్పనిసరి కానున్నాయి. అయితే, శాసన సభ ఎన్నికల్లో ఓడిపోయినా.. స్థానికంగా ఇప్పటికీ బీఆర్ఎస్ బలీయంగానే ఉన్నది. ఇప్పటికిప్పుడు ఎన్నికలు జరిగితే బీఆర్ఎస్ మద్దతుదారులే విజయం సాధించే పరిస్థితులు ఉన్నాయి. దీన్ని గుర్తించిన కాంగ్రెస్ ప్రభుత్వం పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి కార్యాచరణ రూపొందించడం లేదనే అనుమానాలు రాజకీయ వర్గాల్లో వ్యక్తమవుతున్నాయి. నాలుగైదు నెలల తర్వాత జరిగే ఎంపీ ఎన్నికలపై దృష్టి సారించిన రేవంత్ ప్రభుత్వం జనవరితో ముగిసే పంచాయతీ ఎన్నికలను మాత్రం పట్టించుకోవడం లేదు. పాలకవర్గాల స్థానంలో ప్రత్యేకాధికారులను ముందుకు తీసుకొచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయి. ఈ ఎన్నికలు జరగకుంటే ఆరు గ్యారెంటీల అమలును కూడా వాయిదా వే యడం ఒక ఎత్తైతే.. అంతకుముందే ప్రత్యేకాధికారుల తో ఏకపక్షంగా ఆరు గ్యారెంటీల లబ్ధిదారులను ఎంపిక చేసి పార్లమెంట్ ఎన్నికల్లో లబ్ధి పొందొచ్చన్న మరో ఎత్తుగడలో ప్రభుత్వం ఉన్నట్లు సమాచారం. ఇదిలా ఉంటే, ఎన్నికల సంఘం మాత్రం ముందస్తుగా ఎన్నికల ఏర్పాట్లలో ఉన్నది. ఇప్పటికే అధికారులు, పోలింగ్ బూత్‌ల గుర్తింపును చేపడుతున్నది. ఆరు గ్యారెంటీల అమలెలా ఉన్నా గడువులోగా పాలకవర్గాల ఎన్నికలు జరగకుంటే గ్రామ పంచాయతీల అభివృద్ధిపై తీవ్ర ప్రభావం పడ నున్నది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోగా, కేసీఆర్ ప్రభుత్వం అమలు చేసిన పనులు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. ఇక ఎండాకాలంలో తాగునీటి కొరత ఎదురుకానున్నది. పారిశు ధ్యం, వీధిలైట్ల నిర్వహణ, మార్చిలో పన్నుల వసూళ్లు ఎవరు చేస్తారన్న ప్రశ్నలు తలెత్తున్నాయి. పంచాయతీ పాలకవర్గాలు ఉంటేనే గ్రామాల అభివృద్ధి సాధ్యమవుతుందని ప్రజలు భావిస్తున్నారు. ఉమ్మడి మహబూబ్‌నగర్‌లోని ఐదు జిల్లాల్లో 1690కిపైగా పంచాయతీల్లో ఎన్నికలు జరగకుంటే ప్రత్యేకాధికారుల పాలన కిందకు రానున్నాయి.

### గడువులోగా ఎన్నికలు నిర్వహించాలి..



గ్రామాల్లో అభివృద్ధి జరగాలంటే పంచాయతీ ఎన్నికలు కచ్చితంగా నిర్వహించాలి. ఇప్పటివరకు గ్రామాల్లో చేపట్టిన పనులకు బిల్లుల మంజూరు నిలిచిపోగా, కొత్త ప్రభుత్వం రావడంతో అధికారులు పనులు చేపట్టనీయడం లేదు. ఎండాకాలం సమీపిస్తున్నది. తాగునీటి కొరత ఏర్పడే అవకాశం ఉన్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు గ్యారెంటీలను అమలు చేస్తామని చెప్పింది. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరగాలంటే గ్రామ సభల తీర్మానం తప్పనిసరి. ప్రత్యేకాధికారులతో లబ్ధిదారుల ఎంపిక, అభివృద్ధి సరిగ్గా ఉండదు. గడువులోగా ఎన్నికలు నిర్వహించాలి.

*- మల్లేపల్లి శ్రీనివాస్‌రెడ్డి, సర్పంచుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు*

### గ్రామాల అభివృద్ధిపై ప్రభావం..



పంచాయతీ ఎన్నికలు నిర్వహించకుంటే పారిశుధ్యం, నీటి సమస్య, వీధి బల్బులు, పంచాయతీ పన్నుల వసూళ్లపై ప్రభావం పడుతుంది. ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు కలిగి ఉన్న పంచాయతీ ఎన్నికలు జాప్యం చేయడం కాంగ్రెస్‌కు ప్రభుత్వానికి సరికాదు. గెలుపోటములతో సంబంధం లేకుండా ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వం చర్యలు చేపట్టాలి.

*- వేణుగోపాల్‌గౌడ్, సర్పంచ్, తిమ్మాజిపేట*

### ఎలాంటి ఉత్తర్వులు రాలేదు..



పంచాయతీ ఎన్నికల నిర్వహణపై ఎలాంటి ఉత్తర్వులు రాలేదు. నాగర్‌కర్నూల్ జిల్లాలో 461 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఎన్నికల అధికారులు మాత్రం సిబ్బంది నియామకం, పోలింగ్‌బూత్‌ల గుర్తింపు వంటి ప్రక్రియను చేపట్టారు. ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు పంచాయతీ ఎన్నికలపై చర్యలు తీసుకుంటాం.

*- కృష్ణ, డీపీవో, నాగర్‌కర్నూల్*

## దళితబంధు ఇవ్వండి మహాప్రభో!

- మాకు అన్ని అర్హతలు ఉన్నాయి
- అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఒకలా.. గిప్పుడు మరోలా ఎందుకు..?
- దళితుల జీవితాల్లో వెలుగులు నింపిన పథకాన్ని అమలు చేయాలి
- ఎంపికైన లబ్ధిదారుల డిమాండ్
- మహబూబ్‌నగర్, వనపర్తి కలెక్టరేట్ల ఎదుట నిరసన



మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట బైఠాయించిన దళిత సంఘాల ఐక్యవేదిక నాయకులు

మహబూబ్‌నగర్/వనపర్తి, జనవరి 10 : దళితుల జీవితాల్లో గిప్పుడే వెలుగులు వస్తున్న సమయంలో 'మూలుగుతున్న నక్క మీద గుమ్మడికాయ వచ్చి పడ్డ' చందంగా కాంగ్రెస్ ప్రభుత్వ తీరు ఉన్నదని దళితబంధు పథకానికి ఎంపికైన లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేశారు. మాయమాటలు చెప్పి అధికారంలోకి వచ్చిన తర్వాత రేవంత్ సర్కారు ఈ పథకం బంద్, ఆ పథకం ఇవ్వం అనుకుంటూపోతే మా జీవితాలు ఎలా బాగుపడుతాయని దళిత సంఘాల నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. బుధవారం మహబూబ్‌నగర్ కలెక్టరేట్ ఎదుట మహ్మదాబాద్, గండీడ్ మండలాలకు చెందిన దళిత బంధుకు ఎంపికైన లబ్ధిదారులు బైఠాయించారు. అలాగే వనపర్తి కలెక్టరేట్ వద్ద దళిత సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చ ర్ల, పాలమూరు, దేవరకద్ర ఒక్కో నియోజకవర్గానికి 300 మంది చొప్పున 900 మందిని, వనపర్తి జిల్లాలో మొదటి విడుతలో 100 మందిని ఎంపిక చేసి రూ.10 లక్షలు అందించినట్లు తెలిపారు. దీంతో వ్యాపారంతో వారి బతుకుల్లో వెలుగులు ప్రసరించాయన్నారు. రెండో విడుత విషయానికొస్తే పాలమూరు నియోజకవర్గానికి 1,100 చొప్పున అర్హులను ఎంపిక చేశారు. వనపర్తి నియోజకవర్గంలో 1,200 మంది దరఖాస్తు చేసుకున్నట్లు పేర్కొన్నారు. అయితే ఎన్నికలు సమీపించడంతో తర్వాత నిధులు సమకూర్చుతామని చెప్పినట్లు వివరించారు. కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఈ పథకం అమలు ప్రశ్నార్థకంగా మారిందని వాపోయారు. ఇప్పటివరకు పథకంపై రేవంత్ ప్రభుత్వం అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోవడంతో ఎంపికైన లబ్ధిదారులు ఆందోళన చెందుతున్నారన్నారు. వెంటనే దళితబంధు నిధులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బ్యాంకర్ల సూచనల ప్రకారం ప్రభుత్వం నిర్దేశించిన విధంగా దరఖాస్తు చేసుకున్నామని, సంబంధిత అధికారుల వద్ద, కలెక్టర్ కార్యాలయంలో లబ్ధిదారుల వివరాలు ఉన్నాయన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఈ పథకం సాయానికి అదనంగా రూ.2 లక్షలు అదనంగా కలిపి రూ.12 లక్షలను అంబేద్కర్ అభయ హస్తం పేరిట దళితులకు ఆర్థిక సాయం చేస్తారని చెప్పినా నేటికీ స్పష్టత ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. లేకుంటే కేసీఆర్ సర్కారు అందించిన విధంగా రూ.10 లక్షలు ఇస్తారా..? స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మహబూబ్‌నగర్‌లో డీఆర్‌వో రవికుమార్‌కు, వనపర్తి అదనపు లోకల్ బాడీ కలెక్టర్ సంచిత్ గాంగ్వర్‌కు వినతి పత్రాలు అందజేశారు. ఆందోళనలో దళిత నాయకులు వెంకటేశ్, పరంజ్యోతి, వెంకట్, శరవంద, సురేశ్, విజయ్‌కుమార్, ప్రేమ్, రాములు, రవి, దానేలు, శంకర్, లక్ష్మి, అఖిలేందర్, నాగరాజు, మధు, దళిత నాయకులు పాల్గొన్నారు.

### గిదేమి పాలన..



నాకు నడవడానికి రాదు. ఎన్నో ఏండ్ల చరిత్రలో ఎప్పుడూ లేని విధంగా కేసీఆర్ ప్రభుత్వం ఎంతో శ్రమించి దళితబంధు పథకం తీసుకొచ్చింది. గిప్పుడు ఆ పథకానికి డబ్బులు ఇవ్వకుండా ప్రస్తుత సర్కారు వ్యవహరించడం సరికాదు. లేకుంటే భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడుతాం. నిర్లక్ష్యం అనే మాటకు తావు లేకుండా పథకాన్ని అమలు చేయాలి. డబ్బులు వస్తే ఏమైనా పనిచేసుకొని బతుకుతాం అనుకుంటే వచ్చిరాగానే గిట్ల సతాయించడం మంచిదికాదు. గిప్పటికైనా జర్ర ఆలోచన చేయాలె. దళితులకు మంచి చేయాలనే తపనతో ఉంటూ ఈ పథకాన్ని యథావిధిగా కొనసాగించాలి.

*- తిరుమలయ్య, చౌదర్‌పల్లి, మహ్మదాబాద్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా*

### మళ్లీ వెనుకబడేలా చేయొద్దు..



దళితులు మంచిగా బతకాలని కేసీఆర్ ప్రభుత్వం దళితబంధు పథకం అమలు చేసింది. గిప్పుడు వచ్చిన కాంగ్రెస్ ఆ పథకాన్ని ఆపుతామంటే కుదరదు. ఆందోళన చేస్తాం.. రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం చేపడుతాం.. మాకు న్యాయంగా ఇవ్వాల్సిన పథకం ద్వారా నిధులు ఇవ్వాల్సిందే.. మరో పథకం పెట్టాలని డిమాండ్ చేయడం లేదు. సర్కారు జర ఆలోచన చేయాలె. మేము కొత్తవి అడుగుతలేము. గిప్పటికైనా సీఎం రేవంత్ నిధులు ఇచ్చి అందర్ని ఆదుకోవాలి.

*- వెంకట్, గండీడ్ మండలం, మహబూబ్‌నగర్ జిల్లా*



రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్ ఆపరేషన్ జట్టుకు ట్రోఫీ అందజేస్తున్న శ్రీరామ్మూర్తి

## ముగిసిన వాలీబాల్ టోర్నీ

- ట్రాన్స్‌కో ఉద్యోగుల రాష్ట్రస్థాయి పోటీల్లో ఖమ్మం జట్టు విజేత
- రన్నర్‌గా నిలిచిన మహబూబ్‌నగర్

మహబూబ్‌నగర్ టౌన్, జనవరి 10 : విద్యుత్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వాలీబాల్ టోర్నీ విజేతగా ఖమ్మం ఆపరేషన్ జట్టు నిలువగా, రన్నర్‌గా మహబూబ్‌నగర్ ఆపరేషన్ జట్టు నిలిచింది. బుధవారం స్టేడియంలో జరిగిన ఫైనల్‌లో ఖమ్మం ఆపరేషన్ జట్టు 25-21, 25-18 సెట్ల తేడాతో మహబూబ్‌నగర్ ఆపరేషన్ జట్టుపై విజయం సాధించింది. అలాగే హైదరాబాద్ జట్టు 21-19, 23-18 సెట్ల తేడాతో నల్లగొండ ఆపరేషన్ జట్టుపై గెలిచి మూడోస్థానంలో నిలిచింది. నల్లగొండ ఆపరేషన్ నాలుగోస్థానం దక్కించుకున్నది. విజేతలకు విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీరామ్మూర్తి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడల్లో గెలుపోటములు సహజమన్నారు. ఉద్యోగులకు ఒత్తిడి దూరం అవుతుందనే పోటీలు నిర్వహించామన్నారు. కార్యక్రమంలో డీవైఎస్‌వో శ్రీనివాస్, డీఈలు చంద్రమౌళి, వెంకటశివరామ్, కృష్ణమూర్తి, బాషా, ప్రసాద్‌రావు, మోహనకృష్ణ, స్పోర్ట్స్ ఆఫీసర్ జగన్నాథ్, గేమ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ షకీల్, శ్రీనివాస్ ఉన్నారు.

## లారీని ఢీకొన్న ట్రావెల్స్

కొత్తకోట, జనవరి 10 : శబరికి వెళ్తున్న వాహనం లారీని ఢీకొనడంతో ముగ్గురికి గాయాలైన ఘటన కొత్తకోట మండలం అమడబాకుల ఆర్‌కే దాబా సమీపంలోని ఎన్‌హెచ్-44పై చోటు చేసుకున్నది. స్థానికుల కథనం మేరకు.. హైదరాబాద్ నుంచి శబరిమలకు 16 మంది అయ్యప్ప భక్తులు మినీ ట్రావెల్స్‌లో బయలుదేరారు. బుధవారం సాయంత్రం కొత్తకోట సమీపంలోకి రాగానే వాహనం టైర్ పగిలిపోవడంతో అదుపుతప్పి హైవే-44 పక్కన నిలిచి ఉన్న లారీని ఢీకొట్టింది. దీంతో డ్రైవర్ అజయ్‌తోపాటు పెంటన్న, సురేశ్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను వనపర్తి ఏరియా దవాఖానకు తరలించారు.